ప్రజాపాలనతో ప్రజల వద్దకు ప్రభుత్వం

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకుగాను ప్రజాపాలనతో ప్రభుత్వం, అధికారులను ప్రజల వద్దకు తీసుకువస్తున్నారని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో భాగంగా మహబూబాబాద్ మండలంలోని ఉత్తరతండా, నడివాడలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కిపెట్టి పేదలకు అన్యాయం చేసిందన్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి కల్లబొల్లి కబుర్లతో కాలం వెళ్లదీసి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాపాలన గ్రామ సభలు ఏర్పాటు చేశారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాలకు బస్సు సౌకర్యం విషయంలో ఆర్టీసీ అధికారులతో మాట్లాడి రవాణా ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదగాని నర్సదగుట్టయ్య, ఎంపీటీసీ రాగిపాటి శ్రీపాల్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టరు తాడూరి కృష్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, అధికారి సూర్యనారాయణ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, నాయకులు రాగిపాటి బుచ్చిరెడ్డి, మైదం ఈశ్వరయ్య, ప్రసాద్, జంగిలి మల్లేశం, చీరిక కిరణ్ రెడ్డి, క్లైం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు

నెల్లికుదురు: అట్టడుగున ఉన్న నిరుపేదలకు పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీలను అమలు చేసి అందించేందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే మురళీనాయక్ తెలిపారు. మండలంలోని మేచరాజుపల్లి, కాచికల్, శ్రీరామగిరి, మధనతుర్తి గ్రామాలల్లో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మి దేవేందర్‌రావు, శ్రీనివాస్, జ్యోతి, అనిల్, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, అధికారులు డీఈఓ రామారావు, ఎంపీడీఓ శేషాద్రి, తహసీల్దార్ రాజు, ఏఓ రవీందర్‌రెడ్డి, ఎంపీఓ పార్థసారథి, సొసైటీ చైర్మన్ దేవేందర్‌రావు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గూడూరు: ఎన్నికల ముందు నుంచి చెప్పిన విధంగా ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని కొల్లాపురం, బొల్లెపల్లి, తీగలవేణి గ్రామాలలో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రోజారాణి, ఏఓ అల్లె రాకేష్, తహసీల్దార్ అశోక్‌కుమార్, సర్పంచ్‌లు సుధాకర్‌రావు, సునీత, శైలజ పాల్గొన్నారు.

దరఖాస్తులను వెంటనే పరిశీలన చేయాలి

తొర్రూరు రూరల్: ప్రజాపాలన కార్యక్రమంలో అందించిన దరఖాస్తులను వెంటనే పరిశీలన చేసి అర్హత కలిగిన ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీపీ తూర్పాటి అంజయ్య, జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాంచారీమడూరు గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఈనెల 6న నేటితో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ విజయ్‌కుమార్, సర్పంచ్ గుంటుక యాకలక్ష్మి, ఎంపీటీసీ కుంభం సుకన్యరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, నాయకుడు కందాడి అశోక్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ హయాంలోనే పేదలకు అన్నివిధాలా న్యాయం జరుగుతుందని 30వ వార్డు కౌన్సిలర్ ఆరేంపుల విజయమ్మ అన్నారు. వార్డు నందినగర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ప్రజాపాలన నిర్వహించారు.

బయ్యారం: మండలంలోని కొత్తగూడెం, కోయగూడెం, జగత్‌రావుపేట, అల్లిగూడెం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలను ఉద్దేశించి తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి మాట్లాడారు.

ముగిసిన గ్రామసభలు

డోర్నకల్: మండలంలోని 26గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన గ్రామసభలు ముగిశాయి. శుక్రవారం అమ్మపాలెం, చాప్లాతండాల్లో గ్రామసభలు నిర్వహించారు. 26 గ్రామాల నుంచి ఐదు గ్యారంటీలకు సంబంధించి 10,251 దరఖాస్తులు స్వీకరించగా, 3,109 జనరల్ దరఖాస్తులు స్వీకరించారు. ఆరు గ్యారంటీలకు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోనివారు శనివారం చివరి రోజు దరఖాస్తు చేసుకోవాలని డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ కోరారు. శనివారంతో ముగుస్తుందన్నారు.



మహబూబాబాద్ రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



తొర్రూరు రూరల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రజాప్రతినిధులు



మహబూబాబాద్ అర్బన్: 30వ వార్డులో..

మహిళా సాధికారతకు విద్య అనివార్యం

మహబూబాబాద్ రూరల్: మహిళా సాధికారత సాధనకు విద్య అనివార్యమని జెండర్ స్పెషలిస్టు అనిత అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం క్లైం వెంకటరెడ్డి అధ్యక్షతన అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన అనిత మాట్లాడుతూ.. బాలికలు వారి ప్రగతి సాధనకు బాగా చదువుకోవాలన్నారు. భారత్‌లో ఇంకా భ్రూణహత్యలు, బాల్యవివాహాలు కొనసాగుతున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు 1098కి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, కవిత, జనార్దన్, రమేష్, బాలాజీ, యుగంధర్, జ్యోతి, సభ్యులు సంధ్యారాణి, రాకేష్ పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



చిన్నగూడూరు: అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

చిన్నగూడూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని దాశరథి ప్రాంగణంలో ఇండియన్ బ్యాంక్, తపాలా శాఖ, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు, ఆఫీసర్ పాషా, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ బుర్ర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో పేదలకు ప్రయోజనం

డోర్నకల్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్రం అమలు చేస్తున్న పథకాలతో పేదలు ప్రయోజనం పొందుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు బానోని నాగేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని హన్యాతండాలో శుక్రవారం భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించి కేంద్ర పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్లు, ముద్ర యోజన, సుకన్య సమృద్ధి యోజన, జనధన్ యోజన, విశ్వకర్మ యోజన లాంటి పథకాలతో ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నెహ్రూసెంటర్: తెగుళ్ల సోకి రాష్ట్ర వ్యాప్తంగా మిర్చి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ అన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మిర్చి సాగు విస్తీర్ణం పెరిగినా బొబ్బరోగం, నల్లిపురుగు తెగులుతో దిగుబడులు తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గునిగంటి రాజన్న, శెట్టి వెంకన్న, నాయకుల పాపారావు, వెంకట్‌రెడ్డి, సుధాకర్, కందాల రమేష్, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

టీపీటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



పెద్దవంగర: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

పెద్దవంగర: విద్యా సదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమారపు ఐలయ్య కోరారు. ఈనెల 7న తొర్రూరు డివిజన్ కేంద్రంలోని డివిజన్ స్థాయిలో చేపట్టనున్న విద్యా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం మండలంలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల్లో టీపీటీఎఫ్ ఆధ్యర్యంలో ఆవిష్కరించారు. అలాగే టీపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సంఘం మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్ సమక్షంలో ఆవిష్కరించారు. హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పాకనాటి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, అంజనేయులు, సీఆర్పీ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రంలో..

కేసముద్రం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ఆవరణంలో టీపీటీఎఫ్ క్యాలెండర్‌లను శుక్రవారం ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు చీకటి వెంకట్రాంనర్సయ్య మాట్లాడుతూ.. తొర్రూరులో ఈనెల 7న టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసదస్సుకు, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళీ హాజరవుతున్నారన్నారు. సదస్సును విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ బాధ్యులు నర్సింహారాజు, సురేందర్, నర్సయ్య, మోహనకృష్ణ, ప్రణయ్‌కుమార్, యాదగిరి, మునీర్ అహ్మద్, గోవర్ధన్, జయపాల్‌రెడ్డి, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్యం

జనగామ: నిత్యం నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఉంటానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఘట్‌కేసర్‌లోని నీలిమా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనగామ నియోజక వర్గ పేషెంట్లను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఒకొక్కరి వద్దకు వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పేషెంట్లు ఎమ్మెల్యే ఔదార్యానికి రుణపడి ఉంటామని చెప్పారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నీలిమా ఆస్పత్రిలో నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యసేవలు అందిస్తామన్న మాటను నిలబెట్టుకోవడం జరుగుతుందన్నారు. సామాజిక సేవతో పాటు జనగామ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

రాములోరి అక్షింతల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: అయోధ్య నుంచి వచ్చిన పవిత్రమైన శ్రీ రాములవారి అక్షింతలను మానుకోట 36వ వార్డులోని అడ్వకేట్ కాలనీలో, 9వ వార్డు డాక్టర్ రూపులాల్ ఆస్పత్రి ప్రాంతంలో శుక్రవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాదు మహిపాల్ రెడ్డి, సంగీత, లక్ష్మీనరసింహారావు, శోభారాణి, రవికుమార్, అనిల్ కుమార్, రమేష్, రాధిక, పున్నంచంద్ మాల్పాని, ప్రేమ్‌చంద్ వ్యాస్, జుగల్ మాల్పాని, క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ పాల్గొన్నారు. మండలంలోని లక్ష్మీపురం(బి) గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్, వెంకన్న, శ్రీనివాస్, ఉపేందర్, ఉప్పలయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండలంంలోని జయ్యారం గ్రామంలో అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అయోధ్య నుంచి జయ్యారానికి చేరినఅక్షింతలను గ్రామ ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఊరేగింపుతో ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు.

కేసముద్రం: మండలంలోని అమీనాపురంలో అయోధ్య రాముడి అక్షింతలు, కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. బాధ్యులు వోలం శ్రీనివాస్, రామభక్తులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలు

మహబూబాబాద్ అర్బన్: నెహ్రూ యువ కేంద్ర వరంగల్ వారి ఆధ్వర్యంలో మేరా భారత్ వికసిత్ భారత్ అనే అంశంపై ఈనెల 9న ఉదయం 10:30 గంటలకు జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నామని నెహ్రూ యువ కేంద్ర వరంగల్ యువజన అధికారి చింతల అన్వేష్ శుక్రవారం తెలిపాడు. 12-01-1995 నుంచి 12-01-2009 మధ్యకాలంలో జన్మించిన యువతీ యువకులకు, జిల్లా వాసులు మాత్రమే ఈపోటీలో పాల్గొనాలన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన ప్రథమ విజేతను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 8న సాయంత్రం 5గంటల లోపు మేరా భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు ప్రోగ్రాం కోఆర్డినేటర్ అలువాల తేజస్వి 96519 86965, 76739 56173 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

నిరుద్యోగ ఉద్యమ కళాకారుల హామీ నెరవేర్చాలి

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ నిరుద్యోగ ఉద్యమ కళాకారులకు ఇచ్చిన ఉద్యోగ హామీని నెరవేర్చాలని తెలంగాణ నిరుద్యోగ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనువోజు వెంకటేశం కోరారు. డోర్నకల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పదేళ్లుగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో ఉద్యమకారులుగా చురుకుగా పాల్గొన్న వారికి గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమ కళాకారులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకట్రావ్, రామారావు, ఉపేందర్, శ్రీను, పున్నా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చర్య తీసుకోవాలి

గార్ల: గార్ల గ్రామ పంచాయతీ 5వ వార్డు సభ్యురాలు అజ్మీర సుమలత నెహ్రూసెంటర్‌లో ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర రాము శుక్రవారం కార్యదర్శి కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. నాయకులు శ్రీను, బుచ్చిబాబు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



దంతాలపల్లి: మండలం వేములపల్లి గ్రామంలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయిక్రికెట్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి వసంత, దాతలు నూకల శ్రావణ్‌కుమార్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ పర్వయ్య, ఆవుల సురేష్, రాజశేఖర్‌రెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ చోరీ

డోర్నకల్: స్థానిక బైపాస్ రోడ్డులోని పెట్రోల్‌బంక్ ఆవరణలో నిలిపిన ట్రాక్టర్ శుక్రవారం మాయమైంది. యాదవనగర్‌కు చెందిన దాసరి శ్రీనివాస్ తన ట్రాక్టర్‌ను గురువారం రాత్రి బైపాస్ రోడ్డులోని పెట్రోల్ బంక్ ఆవరణలో నిలిపి వెళ్లాడు. శుక్రవారం ఉదయం శ్రీనివాస్ ట్రాక్టర్ కోసం పెట్రోల్ బంక్ వద్దకు రాగా ట్రాక్టర్ కనిపించలేదు. శ్రీనివాస్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు బంక్ వద్దకు చేరుకుని అక్కడి సీసీ ఫుటేజీని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని అనాథ వృద్ధులకు, దివ్యాంగులకు అక్షయపాత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికి భోజనం ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో చిన్నాల ప్రశాంత్, ఎండి.షాబుద్దిన్, రఘు, కట్టయ్య, గంజి వీరేందర్‌రెడ్డి, ఏఎన్ఎం కవిత, మురళీ, ప్రశాంత్, సునీల్, చంద్రకుమార్, రాజేందర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన విలేఖరి కొత్తపల్లి రాములు తల్లి లక్ష్మి(80) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు శుక్రవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండి సంపత్‌కుమార్, జర్నలిస్టులు సంతాపం తెలిపారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

సన్మానం



గార్ల: విధుల పట్ల అంకితభావంతో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని గార్ల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ చింత రమేష్ అన్నారు. గార్ల సీహెచ్‌సీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదోన్నతిపై బయ్యారం పీహెచ్‌సీకి వెళ్తున్న ఉషారాణిని సన్మానించారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు చంద్రశేఖర్, వినీల్‌రెడ్డి, హనుమంతరావు, రాణాప్రతాప్, జ్యోతి, సాయిలక్ష్మి, స్టాఫ్‌నర్సులు రమ, జ్యోతి, జయమ్మ, సరిత, ఆశ పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళా ప్రదర్శన

డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం గ్రామంలో శుక్రవారం ఆరు గ్యారంటీలపై సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి బండ్ల వెంకన్న కళాబృందం కళాకారులు ఆటా పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగభవాని, సర్పంచ్ ధరంసోత్ రాంబాయి, కళాకారులు ఉప్పరి సురేష్, జిన్నా, శ్రీను, కవిత, భరత్, ప్రవీణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులు ఐక్యంగా ఉండాలి

కురవి: యాదవ కులస్తులు ఐక్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజు యాదవ్ అన్నారు. శుక్రవారం సీరోలు మండల కేంద్రంలో సీరోలు గ్రామ సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండల అధ్యక్షుడిగా పెరుగు రాజుయాదవ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు వేముల వెంకన్న, ప్రధాన కార్యదర్శి నసర్ల బాబురావు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పోతుల దిలీప్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సూపర్‌వైజర్ కవిత చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ హన్నీ, ఆశాలు కవిత, గర్భిణిలు, బాలింతలు పాల్గొన్నారు.

తాగునీటి బావికి మరమ్మతులు చేపట్టాలి



డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధి సిగ్నల్ తండాలోని తాగునీటి బావికి మరమ్మతులు చేయాలని తండావాసులు కోరుతున్నారు. సిగ్నల్ తండాతోపాటు లాలితండా, మంగాతండాలోని సుమారు 200 వందల కుటుంబాలకు తాగునీటి బావి ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. తండాకు భగీరథ పైపులైన్ ఏర్పాటు చేసి ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించినా భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో తాగునీటి బావి ద్వారా నేరుగా నీటిని సరఫరా చేస్తున్నారు. బావిలో పిచ్చి చెట్లు, పూడిక మట్టి పెరగడంతో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. మరోవైపు భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ఓవర్ హెడ్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి బావిలోని పూడిక మట్టి, చెట్లను తొలగించి మరమ్మతులు చేపట్టాలని, భగీరథ నీటితో ట్యాంకును నింపి తండాకు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దుప్పట్లు, దోమ తెరల పంపిణీ

గూడూరు: వృద్ధులు చలి, దోమల బారిన పడకుండా కుటుంబ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రెడ్ క్రాస్ సొసైటీ మహబూబాబాద్ శాఖ చైర్మన్ పి. వరప్రసాద్ అన్నారు. మండలంలోని మట్టెవాడ శివారు మారుమూల ఏజెన్సీ గ్రామాలైన దొరవారితిమ్మాపురం, ఊట్ల, మచ్చర్ల, కొంగరగిద్ద గ్రామస్తులకు శుక్రవారం దుప్పట్లు, దోమ తెరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు నెహ్రూ, వెంకన్న, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వీరన్ననాయక్, ఎంపీడీఓ రోజారాణి, తహసీల్దార్ అశోక్‌కుమార్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీఓఎస్ నాయకులు



మహబూబాబాద్: కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను శుక్రవారం టీఎన్జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నాయకులు రోహిత్, ఉషారాణి, సోమని, రంజిత్, సురేష్, వెంకటేశ్వర్లు, వీరునాయక్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

మరిపెడ: జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అద్వైత్ కుమార్ సింగ్‌ను మున్సిపాలిటీ కమిషనర్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించారు.

ధ్వంసమైన పల్లెప్రకృతి వనం పరిశీలన



సాక్షి ఎఫెక్ట్..

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామ శివారు గుజిలి తండా సమీపంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన సంఘటనపై సీరోలు మండల రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈనెల 4వ తేదీన సాక్షిలో 'పల్లె ప్రకృతివనం ధ్వంసం' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి విదితమే. ఈ మేరకు సీరోలు మండల రెవెన్యూ అధికారులు ధ్వంసమైన పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు పంపుతామని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మహ్మద్ యాకూబ్‌పాషా, సర్వేయర్ తిరుమలరావు, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్సూర్ పాల్గొన్నారు.

పెళ్లి కుమార్తెగా గోదాదేవి



మహబూబాబాద్ రూరల్: ధనుర్మాస వ్రత మహోత్సవ పూజా వేడుకల్లో భాగంగా పట్టణంలోని శ్రీవేణుగోపాల స్వామివారి దేవాలయంలో శుక్రవారం గోదాదేవి అమ్మవారిని పెళ్లి కూతురుని చేసే వేడుకను కనుల పండువగా నిర్వహించారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా మధు



కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామ తెలంగాణ యాదవ మహాసభ ఎన్నిక ఏకగ్రీవంగా శుక్రవారం జరిగింది. అధ్యక్షుడిగా కేసాని మధు, ఉపాధ్యక్షుడిగా బడుగుల మోహన్, ప్రధాన కార్యదర్శిగా వంగ వినోద్, కోశాధికారిగా బుడుగుల భట్టు, సలహాదారుడిగా కన్నబోయిన వెంకటేష్‌లను ఎన్నుకున్నట్లు సీరోలు మండల అధ్యక్షుడు పెరుగు రాజుయాదవ్ తెలిపారు.

ఉద్యోగాలకు దరఖాస్తులు

మహబూబాబాద్: హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లామా లేదా డిగ్రీ, హోటల్ (ఫుడ్ అండ్ బెవేజేస్) సర్వీస్ చేసి, అనుభవం కలిగి ఉండి పాస్‌పోర్ట్ ఉన్న అభ్యర్థులకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ హైదరాబాద్ వారి ద్వారా జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జిల్లా ఉపాధి అధికారి ఆర్‌డీయస్‌వీ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు రూ.లక్ష నుంచి రూ.1,50,000 వరకు ఆకర్షణీయమైన వేతన ప్యాకేజీతో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. అభ్యర్థులు 22 నుంచి 27 ఏళ్ల మధ్య ఉన్న వారు బయోడేటాను ఈనెల 7వ తేదీలోపు మెయిల్ చేయాలన్నారు. పూర్తి వివరాల కోసం టాంకాం హెచ్‌ఆర్ మేనేజర్ 91007 98204, 78935 66493 నంబర్లను సంప్రదించాలని కోరారు.

'దళితబంధు' నిధులు విడుదల చేయాలి



కేసముద్రం: దళితబంధుకు ఎంపికైన నిరుపేద దళితులకు, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన నిరుపేద లబ్ధిదారులకు కోడ్ కారణంగా నిధులు విడుదలను నిలిపివేశారన్నారు. ఎంపికైన వారికి నిధులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మహేందర్, శ్రీనివాస్, విద్యాసాగర్, సుధాకర్, సురేష్ పాల్గొన్నారు.